RNI NO: APTEL/26/A7631

మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 01 | సంచిక : 24 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజిలు : 4 | వెల రూ. 2 | బుధవారం -30 - సెప్టెంబర్ - 2026

Published From : Anatapuram circulated by YSR Kadapa I Chittoor I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

- ఆరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న విపత్తుల నిర్వహణ సంస్థ
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల వేళ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉందని వెల్లడి

రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో

పల్లె పండుగ 3.0' ప్రారంభం

పాడి రైతుల కోసం మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు, ఉద్యానవనాల ఏర్పాటు

- ★ గ్రామసీమల అభివృద్ధికి 'పల్లె పండుగ 3.0'.. రామాపురంలో లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్
- ★ నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శ్రీకారం
- ★ 15,500 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.10,250 కోట్లు కేటాయింపు
- ★ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమన్న ప్రభుత్వం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు. ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మిగతా 2 లో

అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు

- విజయవాడలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్‌షాప్
- ఉద్యోగుల సామర్థ్య పెంపులో ఏపీకి జాతీయ స్థాయిలో తొలి ర్యాంక్
- విజేతలకు అవార్డులు అందజేసి ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సాంకేతికత, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న సీఎం
- రెండో స్థానంలో కర్ణాటక, మూడో స్థానంలో ఒడిశా

విద్యుత్ బిల్లులో ఈ-చలాన్లు.. వసూళ్లపై సుప్రీం కీలక సూచన

- ట్రాఫిక్ చలాన్ల వసూలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ఈ-చలాన్లను కరెంట్ బిల్లులో కలిపేయాలని సూచన
- దేశవ్యాప్తంగా రూ.45 వేల కోట్ల చలాన్లు పెండింగ్
- చలాన్లు కట్టనివారికి ఆర్సీ రెన్యువల్ నిలిపివేయాలని సలహా

ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఢిల్లీ: ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మిగతా 2 లో

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు

చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో

గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం

- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం

అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మిగతా 2 లో

చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని

విదేశీ బొగ్గు కొంటున్నారు

ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ

- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మిగతా 2 లో

నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా.. కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది

అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలి

- దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది
- ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారు
- ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం
- రాష్ట్రంలో ఉన్న సామర్థ్యాన్ని అక్కడి స్థానిక వనరులు, మానవ వనరులతోనే అభివృద్ధి చేసే విధంగా కేంద్రం ప్రోత్సహించాలి

ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మిగతా 2 లో

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మిగతా 2 లో

విద్యుత్ బిల్లులో ఈ-చలాన్లు..
వసూళ్లపై సుప్రీం కీలక సూచన

ఢిల్లీ: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనదారుల నుంచి ఈ-చలాన్ల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. పేరుకుపోయిన చలానాల మొత్తాన్ని వాహనదారుల విద్యుత్ బిల్లులకు జోడించి వసూలు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దేశంలో ప్రస్తుతం అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతుల ద్వారా వసూళ్లు చేయడం కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో దాదాపు రూ.45 వేల కోట్ల విలువైన ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే వసూలైనట్లు సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఈ భారీ బకాయిలపై జస్టిస్ పార్థివాలాతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. "ఒకే మార్గంలో పయనిస్తామంటే ఈ దేశంలో సాధ్యం కాదు. ఈ-చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులతో అనుసంధానించండి" అని వ్యాఖ్యానించింది. చలాన్లు చెల్లించని వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోర్టు సూచించింది. అటువంటి వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) పునరుద్ధరణను నిలిపివేయడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని నిరాకరించడం వంటి చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. బకాయిల వసూలు కోసం అధికారులు వినూత్నమైన, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన..
అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం.. ప్రధానంగా ఆరు జిల్లాల్లో వర్ష ప్రభావం ఉండనుంది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో మంగళవారం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది. వీటితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఇతర జిల్లాల్లోనూ కొన్నిచోట్ల చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురవవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలకు అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున స్థానిక పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం..
పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు..

ఢిల్లీ: భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది. ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. అయితే, ఎల్ఎన్‌జీ కూడా శిలాజ ఇంధనమే కావడంతో ఇది పూర్తిస్థాయిలో కాలుష్యరహిత రైలు కాదు. కానీ, విద్యుదీకరణ పూర్తికాని మార్గాల్లో డీజిల్ వాడకాన్ని, నిర్వహణ ఖర్చులను తగ్గించడం, కర్బన ఉద్గారాలు, నైట్రోజన్ ఆక్సైడ్‌ల విడుదలను నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇటీవల ప్రవేశపెట్టిన హైడ్రోజన్ రైలుకు, ఈ ఎల్ఎన్‌జీ రైలుకు సాంకేతికంగా కీలకమైన వ్యత్యాసం ఉంది. హైడ్రోజన్ రైలులో ఫ్యూయల్ సెల్స్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నడిపిస్తే, ఈ ఎల్ఎన్‌జీ రైలులో మాత్రం సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌నే డ్యూయల్ ఫ్యూయల్ కోసం మార్పులు చేసి వినియోగిస్తున్నారు.

యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా.. భారత్ కీలక నిర్ణయం!

ఢిల్లీ: యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.

ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ

ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.

పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావం

ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.

యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకం

దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

ఇక పోటీ తప్పనిసరి

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు.. ఏపీ ఎన్నికల సంఘం కీలక ప్రకటన

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో రెండు నెలల సమయం పడుతుందంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేతా నేడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలు, రాజకీయ పార్టీలు వీటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లకు సంబంధించిన కోర్టు కేసులలో స్పష్టత వచ్చాకే కమిషన్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుందంటూ జరుగుతున్న ప్రచారం తమ దృష్టికి వచ్చిందని పునేతా తెలిపారు. ఎన్నికలు ఆలస్యమైనా, అంతర్గత ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయని కూడా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వార్తలన్నీ కల్పితమైనవని, కమిషన్ అధికారికంగా జారీ చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మడం గానీ, ఇతరులకు పంపడం గానీ చేయవద్దని సూచించారు. కమిషన్ పేరుతో తప్పుడు, కల్పిత సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఏదైనా ప్రకటన ఉంటే, అది కేవలం అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా పత్రికా ప్రకటన ద్వారా మాత్రమే వెల్లడిస్తామని స్పష్టం చేసింది. వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌తో సరిచూసుకున్నాకే విశ్వసించాలని కోరింది. ఇటీవలే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి ప్రారంభించింది. మరోవైపు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూడా ఎస్ఈసీ సన్నాహాలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సెప్టెంబర్ 23తో మండల ప్రజా పరిషత్‌లు, సెప్టెంబర్ 24తో జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో
'పల్లె పండుగ 3.0' ప్రారంభం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు. ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మొత్తం రూ.10,250 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,500 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో రూ.7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉన్నాయి. రహదారులతో పాటు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పలు ఇతర పనులకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు (పశువుల షెడ్లు), పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెన్లు, పచ్చదనం పెంపు కోసం రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యానవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవే కాకుండా, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.200 కోట్లు కేటాయించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతమివ్వడంతో పాటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'..
ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఢిల్లీ: ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరపున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

చౌకగా లభించే సింగరేణి బొగ్గును
కాదని విదేశీ బొగ్గు కొంటున్నారు

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..
కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది

హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలన్నారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. అసోం దినపత్రిక 'ప్రతిదిన్' మీడియా నెట్‌వర్క్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'ది కాంక్లేవ్ 2026' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. 'India's Next Chapter' అంశంపై జరిగిన చర్చలో దేశ భవిష్యత్ దిశ, విద్య, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సర్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి గారు విస్తృతంగా మాట్లాడారు. దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒక రాష్ట్రంలో ఉన్న సామర్థ్యాన్ని అక్కడి స్థానిక వనరులు, మానవ వనరులతోనే అభివృద్ధి చేసే విధంగా కేంద్రం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులు వంటి కేంద్రం వద్ద సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల విషయాన్ని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావిస్తూ, జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో రాజకీయంగా నష్టం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 1976లో నియోజకవర్గాల సంఖ్యను స్థిరీకరించిన నిర్ణయం, ఆ తర్వాత జరిగిన పరిణామాలను ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని అన్నారు. దేశ రాజకీయాల్లో సంఖ్యాబలం కీలకమని, లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో దక్షిణాది రాష్ట్రాల వాదన బలహీనపడుతుందని విశ్లేషించారు. తెలంగాణను.. విద్య, నైపుణ్యాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా అభివృద్ధి చేసి, దేశ ప్రగతిలో రాష్ట్రాన్ని కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ

హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారంపై అధికారుల సమీక్ష



కడప, సెప్టెంబర్ 29 (మహి న్యూస్): హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లింపు, కేసుల వివరాలపై జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ సమావేశం మంగళవారం వర్చువల్ విధానంలో నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రామ గోపాల్ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవా సదన్‌లోని తన ఛాంబర్ నుంచి సమావేశాన్ని నిర్వహించారు. హిట్ అండ్ రన్ కేసుల వివరాలు, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు తగిన సూచనలు చేశారు. సమావేశంలో కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పోలీసు అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష

కడప, సెప్టెంబర్ 29 (మహి న్యూస్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, కేసుల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రామ గోపాల్ సూచనలతో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవా సదన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, న్యాయ సలహాలు, జైలు సందర్శనలు, కేసుల వివరాలు, పరిష్కార ప్రక్రియపై సమీక్షించి తగిన సూచనలు చేశారు. సమావేశంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. హరిబాబు, డిప్యూటీ చీఫ్ కౌన్సిలర్లు ఎం. చంద్రకాంతమ్మ, ఎం. శాంత, ఎం. వినయ్ కుమార్, అసిస్టెంట్ కౌన్సిలర్లు పి. మనోహర్, ఎం. సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎస్. రవితేజ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ లీజుదారులు, వారసులకు భూ హక్కులు

కడప, మహి న్యూస్ సెప్టెంబరు 29: జెడ్‌హెచ్‌డీసీ భూములను నిబంధనల మేరకు క్రమబద్ధీకరించి అర్హులైన ఎస్సీ లీజుదారులు, వారి చట్టబద్ధ వారసులకు భూ హక్కులు కల్పిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత తెలిపారు. కడప కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో జెడ్‌హెచ్‌డీసీ భూములపై సమీక్షించారు. జిల్లాలోని మూడు మండలాలు, నాలుగు గ్రామాలకు సంబంధించి 304.274 ఎకరాలు, 265 మంది లబ్ధిదారుల వివరాలను కమిటీ పరిశీలించింది. మొదటి దశలో ఖాజీపేట మండలం చెముళ్లపల్లి, దుంపలగట్టు గ్రామాల్లో 150 మంది అర్హులకు సుమారు 150 ఎకరాలపై హక్కులు కల్పించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. అర్హులకు త్వరలో డీకేటీ పట్టాలు, పట్టాదారు పాస్‌బుక్కులు అందజేస్తామని మంత్రి తెలిపారు. వల్లూరు మండలం లేబాకలో 48 మంది, పొరుమామిళ్ల మండలం ఎల్లోపల్లిలో 67 మంది అర్హులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మైదుకూరు మండలం నంద్యాలంపేటకు సంబంధించిన భూముల అంశం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని జేసీ డా. నిధి మీనా తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రెవెన్యూ సమస్యకు పరిష్కారం చూపేలా రికార్డుల పరిశీలన, సర్వే, గ్రామసభలు, వెబ్‌ల్యాండ్ నవీకరణ వంటి ప్రక్రియలు చేపట్టినట్లు తెలిపారు.

జమ్మలమడుగులో మెగా వైద్య శిబిరం

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబరు 29: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానం, పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా జమ్మలమడుగులో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముద్దనూరు రోడ్డులోని రోటరీ క్లబ్‌లో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు. కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, వైద్యులు, ప్రజలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎస్. రవి, దిశా ఉమ్మడి జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వేంపల్లి భాస్కర్

మదనపల్లె,మహి న్యూస్ సెప్టెంబర్ 29: హెచ్ఐవి/ఎయిడ్స్‌పై యువతకు అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టడంతో పాటు ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎస్. రవి, దిశా ఉమ్మడి జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వేంపల్లి భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏపీ శాక్స్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి హెచ్ఐవి/ఎయిడ్స్ అవగాహన క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి సోకకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, అనుమానం ఉన్నవారు నిర్భయంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని కోరారు.

క్విజ్ పోటీల విజేతలు

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి – ప్రభుత్వ జూనియర్ కళాశాల, పుంగనూరు, ద్వితీయ బహుమతి – పీవీసీ జూనియర్ కళాశాల, వాల్మీకిపురం, తృతీయ బహుమతి -- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మదనపల్లె సాధించాయి. కన్సొలేషన్ బహుమతి – కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల, మదనపల్లెకు లభించింది. విజేతలు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే. మోహన్ కుమార్, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ చంద్రకళ, దిశా సీపీఓ ఆనంద్, ఎన్జీవో ప్రతినిధులు పురుషోత్తం, ఓబులేసు, స్వాతి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, అన్నమయ్య జిల్లా.

కడప దేశంలోనే ప్రథమ స్థానం.. మంత్రి సవిత అభినందన

కడప, మహి న్యూస్ సెప్టెంబరు 29: ఆకాంక్ష జిల్లాల కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా వరుసగా మూడు త్రైమాసికాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా యంత్రాంగం సమష్టి కృషికి నిదర్శనమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత అభినందించారు. కడప కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. పెండింగ్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలు మెరుగ్గా అందించాలని అధికారులను ఆదేశించారు.

ఆకాంక్ష జిల్లాల కార్యక్రమంలో అగ్రస్థానం

కడప జిల్లా మార్చి 2026లో 80.06 కాంపోజిట్ స్కోర్ సాధించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో లక్ష్యాలను సాధిస్తున్నట్లు వివరించారు.

వర్షాభావంపై ప్రత్యేక దృష్టి

సెప్టెంబరు 28 నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 395.4 మి.మీ.కు గాను 216.9 మి.మీ. మాత్రమే నమోదైందని, 45.1 శాతం లోటు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు, తాగునీరు, పశువుల రక్షణకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ప్రధాన జలాశయాల మొత్తం సామర్థ్యం 82.214 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.216 టీఎంసీల నీరు, అంటే 46.48 శాతం నిల్వ ఉందని తెలిపారు. తాగునీటికి ప్రాధాన్యం ఇస్తూ నీటి వినియోగాన్ని సమన్వయం చేస్తున్నట్లు వివరించారు.

రైతులకు ప్రత్యామ్నాయ పంటలు

సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు రబీ శనగ సాగుకు చర్యలు చేపట్టి, 10,663 క్వింటాళ్ల విత్తనాలను 35 శాతం రాయితీతో అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

స్మార్ట్ కిచెన్ల విస్తరణ

జిల్లాలో ప్రస్తుతం 36 స్మార్ట్ కిచెన్లు పనిచేస్తుండగా, అక్టోబర్ 1 నాటికి 38 కిచెన్లను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. రోజుకు 73,698 మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

తాగునీరు, పశువుల రక్షణకు చర్యలు

చెరువులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భజలాల పెంపు, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లు, తాగునీటి పనులు, వైద్య సేవలు, ఆసుపత్రుల నిర్మాణాలు, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. 'స్టార్టప్ కడప', 'ఇన్వెస్ట్ కడప' కార్యక్రమాల ద్వారా యువతలో పారిశ్రామిక ఆలోచనలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శాఖల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

ప్యానెల్ న్యాయవాదుల విధులపై సమీక్ష

పేదలకు సకాలంలో ఉచిత న్యాయ సహాయం అందించాలి

కడప, సెప్టెంబర్ 29 (మహి న్యూస్): కడప జిల్లా కోర్టు ప్రాంగణంలోని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు హాలులో ప్యానెల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. శాంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు. పేదలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల పురోగతి, న్యాయ సేవల నాణ్యత, లబ్ధిదారులకు అందుతున్న సహాయంపై సమీక్షించారు. ప్యానెల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు తమకు అప్పగించిన కేసులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. న్యాయ సేవల సహాయవాణి 15100పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ప్యానెల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పులివెందుల /తొండూరు మహి న్యూస్ సెప్టెంబర్ 29: స్థానిక మండల కేంద్రమైన తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా తొండూరు గ్రామానికి చెందిన బి. లోకేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎం. సుహాసిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మరో 13 మంది సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా సజావుగా, ప్రశాంతంగా, ఏకగ్రీవంగా జరిగినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధిలో కమిటీ సభ్యులు కీలకపాత్ర పోషించాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాయచోటి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోదాము తనిఖీ

– జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి, మహి న్యూస్, సెప్టెంబర్ 29 : జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24-7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా.... రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ లో అంతర్భాగాలను రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి తాసిల్దార్ యామిని , కలెక్టరేట్ ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్, సిబ్బంది , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ రైజింగ్‌పై కడపలో డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన..!

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై ప్రజల్లో అవగాహన, వినూత్నంగా ఆకట్టుకున్నా ప్రచార కార్యక్రమం

కడప, మహి న్యూస్ సెప్టెంబరు 29: రాయలసీమను ప్రపంచ ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రాయలసీమ రైజింగ్ – – గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కడప నగరంలో మంగళవారం వినూత్న ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబరు 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "రాయలసీమ రైజింగ్ – గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పౌరసంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు ప్రచారం విజయవంతంగా ముగిసింది. కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాయంత్రం 7 గంటలకు డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన నిర్వహించారు. ఆకాశంలో డ్రోన్లతో ఎల్ఈడీ వెలుగుల ద్వారా "రాయలసీమ రైజింగ్ -- గ్లోబల్ హార్టికల్చర్ హబ్" సందేశాన్ని ప్రదర్శించడంతో మైదానానికి తరలివచ్చిన ప్రజలు ఆసక్తిగా తిలకించారు. రాయలసీమలో ఉద్యాన పంటల సాగును విస్తరించడం, ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఉద్యాన ఆధారిత పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందనే విషయాన్ని... డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. "రాయలసీమ రైజింగ్" ప్రాజెక్టు ద్వారా కలిగే ప్రయోజనాలపై జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రజలు, రైతుల్లో అవగాహన కల్పించేలా వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కడప నగరంలో నిర్వహించిన డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి, మహి న్యూస్, సెప్టెంబర్ 29: మంగళవారం రాత్రి రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్ కి విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ని, రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టరుతో కొద్దిసేపు సమావేశమై. అక్టోబర్ రెండున జిల్లాకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు కేంద్ర మంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లు మరియు జిల్లా అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

జమ్మలమడుగులో అభివృద్ధి పనులకు భూమిపూజ

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబర్ 29: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో సిమెంట్ రోడ్లు, పైప్‌లైన్లు, నీటి ట్యాంకులు తదితర అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్లు, భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రమణారెడ్డి, జమ్మలమడుగు మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురప్పతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాపంపేట, విద్యారణ్యనగర్ పాఠశాలల్లో నూతన స్కూల్ కమిటీలు

అనంతపురం రూరల్, సెప్టెంబర్ 29 (మహి న్యూస్):: అనంతపురం రూరల్ మండలం పాపంపేట, విద్యారణ్యనగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన స్కూల్ కమిటీ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. పాపంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎం. ఉమాదేవి, ఉపాధ్యక్షురాలిగా షేక్ ఫారిదా ఎన్నికయ్యారు. పాపంపేట ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా డి. గౌతమి, ఉపాధ్యక్షురాలిగా పవనకుమారి ఎన్నికయ్యారు. విద్యారణ్యనగర్ ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా ఎస్. గౌసియా, ఉపాధ్యక్షుడిగా ఎస్. ఉస్మాన్ భాష, జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎం. నాగంజి, ఉపాధ్యక్షురాలిగా పి. మున్ని ఎన్నికయ్యారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, ఉపాధ్యక్షులను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అభినందించి సన్మానించారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతుల కల్పనలో నూతన కమిటీలు కీలక పాత్ర పోషించాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): అనంతపురం రాంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించిన మంత్రి.. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

రెవెన్యూ అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

రీ-సర్వే, పట్టాదారు పాస్‌పుస్తకాలు, 22ఏ తొలగింపు కేసులపై సమీక్ష

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సీసీఎల్ఏ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లు,

జాయింట్ కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ-సర్వే పురోగతి, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, 22ఏ తొలగింపు కేసులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), జనగణన, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డీఆర్వో ఏ.మలోల, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, రీ-సర్వే ఏడీ కనక ప్రసాద్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయ విద్యతో రాజ్యాంగ విలువలను కాపాడాలి

విజయనగర లా కాలేజ్‌లో 'యువత భవితకు భరోసా' కార్యక్రమం పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): అనంతపురం హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న విజయనగర లా కాలేజ్‌లో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని లా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. న్యాయ విద్య కేవలం వృత్తికి సంబంధించిన విద్య మాత్రమే కాదని, సమాజంలో న్యాయం, ధర్మం, రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యతను అందించే గొప్ప విద్య అని అన్నారు. విద్యార్థులు రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై లోతైన అవగాహన పెంపొందించుకుని న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని, కేస్ స్టడీల ద్వారా న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కళాశాల నుంచి గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఉండటం అభినందనీయమన్నారు. జూనియర్ న్యాయవాదులకు మార్గదర్శకత్వం అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ రామిరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ రాఘవేంద్రచారి, సీనియర్ అడ్వకేట్ నరసింహులు, సీనియర్ లెక్చరర్ హరి, అధ్యాపకులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

రేకులకుంటలో ఘనంగా అగ్రి ఎక్స్‌పో కిసాన్ మేళా

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): అనంతపురం ఏఆర్ఎస్ రేకులకుంటలో వ్యవసాయ శాఖ, ఆత్మ, వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో మంగళవారం అగ్రి ఎక్స్‌పో కిసాన్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బల్ల పల్లవితో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న మదనపల్లిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రాయలసీమ సమగ్ర ఉద్యాన హబ్‌కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతపురం జిల్లాలో శీతల గిడ్డంగుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామని, పండ్ల తోటల్లో ఉత్పత్తి నాణ్యత పెంచి రాయలసీమను ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ మేళాలో వ్యవసాయ అనుబంధ శాఖలు, పరిశోధన కేంద్రాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీల ప్రదర్శనశాలలను రైతులు సందర్శించారు. జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఆత్మ పీడీ విద్యావతి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, సీఐటీఐఓ లక్ష్మణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ కేర్ హోమ్స్ నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణ

పిల్లల హక్కులు, రక్షణ, పునరావాసంపై అవగాహన కల్పించిన అధికారులు

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): చైల్డ్ కేర్ హోమ్స్ నిర్వాహకులు, ఇన్‌చార్జ్‌లు, సిబ్బందికి జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుడ్డప్ప నగర్‌లోని మై భారత్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బాలల సంరక్షణ, రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. జువెనైల్ జస్టిస్ చట్టం--2015, సంబంధిత నిబంధనల ప్రకారం చైల్డ్ కేర్ హోమ్స్ నిర్వహణ, పిల్లల వ్యక్తిగత రికార్డులు, ఆరోగ్యం, విద్య, భద్రతా చర్యలు, బాలల సంక్షేమ కమిటీ ఆదేశాల అమలు, కుటుంబ పునరేకీకరణ, దత్తత, స్పాన్సర్‌షిప్, ఫోస్టర్ కేర్, ఆఫ్టర్ కేర్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి సాజిదా మాట్లాడుతూ.. చైల్డ్ కేర్ హోమ్స్‌లో జువెనైల్ జస్టిస్ చట్టం, నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పిల్లలకు అవసరమైన ఆరోగ్యం, విద్య, పోషకాహారం, రక్షణ సేవలను సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, విద్య, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు తదితర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పిల్లల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనాథ, నిరాశ్రయ, తల్లిదండ్రులచే అప్పగించబడిన పిల్లలను గుర్తించి వారి కేసులను బాలల సంక్షేమ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. పిల్లలు అవసరానికి మించి సంస్థాగత సంరక్షణలో ఉండకుండా అర్హతను బట్టి దత్తత, ఫోస్టర్ కేర్, స్పాన్సర్‌షిప్, కుటుంబ పునరేకీకరణ వంటి పునరావాస సేవలకు అనుసంధానం చేయాలని తెలిపారు. మిషన్ వాత్సల్య పోర్టల్‌లో పిల్లల వివరాల నమోదు, ప్రొఫైల్‌ల నవీకరణ, అవసరమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై సాంకేతిక శిక్షణ కూడా అందించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరి, అనలిస్ట్ సమీర్, బాలసదనం, శిశుగృహం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్ కేర్ హోమ్స్ ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి

ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడమే లక్ష్యం

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో మంగళవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనేక వనరులు, అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని యువత చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. డీఆర్‌డీఏ, మెప్మా, పరిశ్రమల శాఖలు సమన్వయంతో యువతకు అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటంతో పాటు ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలని అన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో యువత, మహిళలకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతపురం జిల్లాలో అరటి, టమాటా, పండ్ల ఉత్పత్తులకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, ఈ-కామర్స్ ద్వారా ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లాలని చెప్పారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక పరిశ్రమ ఏర్పాటైతే దానికి అనుబంధంగా అనేక చిన్న పరిశ్రమలు ఏర్పడి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, ఎంఎస్ఎంఈ అధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు, డీఆర్‌డీఏ అధికారులు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

20 ఏళ్ల సమస్యకు 3 నెలల్లో పరిష్కారం

రూ.73.95 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

పల్లె పండుగతో గ్రామీణ ప్రాంతాలకు కొత్త వెలుగు: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్ చైతన్య కాలనీలో 20 ఏళ్లుగా ఉన్న రహదారి సమస్యకు మూడు నెలల్లోనే పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పల్లె పండుగ--3.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం రూ.73.95 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి పల్లె పండుగ--3.0 కింద రూ.2.35 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటితో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మూడు నెలల క్రితం చైతన్య కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన సమయంలో స్థానికులు రహదారి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. వారి విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని తెలిపారు. గతంలో స్వల్ప వర్షాలకే కాలనీ ముంపునకు గురయ్యేదని, కొత్త సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జర్మనీ, దుబాయ్‌లో డ్రైవర్ ఉద్యోగాలకు అవకాశం

అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

అనంతపురం, సెప్టెంబర్ 29: (మహి న్యూస్): జర్మనీ, దుబాయ్‌లో డ్రైవర్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి ఎస్.పల్లవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జర్మనీ ట్రైలర్ డ్రైవర్ ఉద్యోగాలు: ఎస్ఎస్సీ ఉత్తీర్ణత, కనీసం మూడేళ్ల డ్రైవింగ్ అనుభవం, గరిష్ఠంగా 40 ఏళ్ల వయస్సు కలిగిన పురుషులు అర్హులు. ఎంపికైన వారికి జర్మనీలో డ్రైవింగ్ లైసెన్స్, ప్రథమ చికిత్స, ట్రక్ డ్రైవింగ్, లోడ్ భద్రత, ఏడీఆర్ తదితర అంశాలతో పాటు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో నెలకు సుమారు 2,600--2,900 యూరోలు, అనంతరం 2,800--3,200 యూరోల స్థూల వేతనం లభించే అవకాశం ఉంది. నమోదు చివరి తేదీ అక్టోబర్ 4 కాగా, అక్టోబర్ 6న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. దుబాయ్ టాక్సీ డ్రైవర్ ఉద్యోగాలు: ఎస్ఎస్సీ ఉత్తీర్ణత, 25 నుంచి 42 ఏళ్ల వయస్సు కలిగిన పురుషులు అర్హులు. భారతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. నెలకు సుమారు 4,000--5,000 దిర్హామ్‌ల వరకు సంపాదించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూ, డ్రైవింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. అక్టోబర్ 5న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. విదేశీ ఉద్యోగాలకు సంబంధించి అర్హతలు, శిక్షణ, వీసా, లైసెన్స్, సేవా రుసుములు, ఇతర నిబంధనలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే దరఖాస్తు ప్రక్రియలో ముందుకు వెళ్లాలని తెలిపారు.

నమోదు: నైపుణ్యట పోర్టల్ -https://naipunyam.ap.gov.in
సంప్రదింపులు: 9581853106

ఉద్యాన పంటల సాగుపై కళాజాత చైతన్య ప్రచార కార్యక్రమాలు

అనంతపురం, మహి న్యూస్ సెప్టెంబర్ 29:- రాయలసీమ ,ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను భారతదేశంలోనే అత్యంత కీలకమైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా (ప్రపంచ ఉద్యాన కేంద్రం) రూపాంతరం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ బృహత్తర ప్రాజెక్టు ప్రాముఖ్యతను, ప్రతిపాదిత ప్రణాళికలను ప్రజలు, రైతులు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాలు శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ సమన్వయంతో కళాజాత బృందాల ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్షేత్రస్థాయి లో ప్రణాళిక బద్ధంగా రూపొందించిన ఆయా గ్రామాలలో ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమాలు రోజువారీగా చేపట్టడం జరిగింది. జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 9 వరకు ప్రతిరోజు సాయంత్రం ఉద్యాన శాఖ క్లస్టర్లలోని గ్రామాలలో కార్యక్రమాలు జరుగుతాయి. అందువల్ల ఈ ప్రచార అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరడమైనది. ఈ నేపథ్యంలో జిల్లాలో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చెందే దిశగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఉద్దేశంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గ పరిధిలో ఆయా మండలాలలో ప్రతిరోజు రెండు గ్రామాలు చొప్పున కళాబృందాలు పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

30-9-2026 వ తేదీ జంతలూరు,
1-10-2026 వ తేది కేశేపల్లి, నార్పల, సూరేపల్లి
2-10-2026 పెద్దపప్పూరు ముచ్చుకోట
3-10-2026 ఈదులపల్లి పాల్యం
4-10-2026 గార్లదిన్నె ఎర్రగుంట్ల
5-10-2026 చెయ్యేదు, మన్నల
6-10-2026 హంపాపురము ప్రసన్నాయపురము
7-10-2026 గొల్లా, గంగవరము
8-10-2026 పి కౌకుంట్ల-1, చిన్నముస్తూరు
9-10-2026 కుదేరు, గొటుకూరు

పై గ్రామాలలోఉద్యాన పంటల సాగుపై కళాజాత చైతన్య ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

గూడెం చెరువు వద్ద ఏపీటిట్కో గృహాల పంపిణీ

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబర్ 29: జమ్మలమడుగు మండలం గూడెం చెరువు సమీపంలో ఏపీటిట్కో ఆధ్వర్యంలో నిర్మించిన గృహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు గృహాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో వారు మాట్లాడి గృహాల వివరాలను తెలుసుకున్నారు. సొంత ఇల్లు అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరం

- డీఈఓ కేవీఎన్ కుమార్

తిరుచానూరు, సెప్టెంబర్ 29, మహి న్యూస్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాలలతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ స్పష్టం చేశారు. పాఠశాల విద్యా ప్రగతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ పునర్వ్యవస్థీకరణ ఎన్నికల కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఎంసిల ద్వారా తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు, విద్యా పురోగతిపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఉపాధ్యాయులతో కలిసి పనిచేయాలని కోరారు. ఇంటి వద్ద కూడా పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లను సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అనే అంశాన్ని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. అలాగే పిల్లలు మాదకద్రవ్యాలు, ఇతర దురలవాట్లకు గురికాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చడంలో తల్లిదండ్రులే కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల చదువును బాధ్యతగా భావించి, పాఠశాలతో నిరంతరం అనుసంధానమై ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సుమారు 300 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. 6 నుంచి 12 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి 18 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరి నుంచి చైర్మన్‌గా ఎం. గౌరి, వైస్ చైర్మన్‌గా కే. హరి ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసు, వెంకటముని, లీలా ప్రతాప్, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com